సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 26 | మార్చి | 2025



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడి సాధించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. - 8లో▸



'డిగ్రీ' ఉత్తీర్ణత అంతంతే..

కేయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం అంతంత మాత్రంగానే ఉండటం ఆందోళన కలిగిస్తుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.9^0 / 21.9^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.



ఇఫ్తార్	సహర్
బుధ 6:34	గురు 4:53

రంజాన్ వేళలు

రైతుల అరిగోస..

మార్కెట్‌కు మిర్చి బస్తాలు తీసుకొచ్చిన రైతులు ఉక్కిరిబిక్కిరి

- సాయంత్రం వరకు ప్రకటించని విన్నర్ లిస్టు
- రోజుల తరబడి యార్డుల్లోనే పడిగాపులు
- మిర్చి కొనడం లేదని బోర్డు పెట్టడంతో రైతుల ఆందోళన
- వ్యాపారులు, అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు



మహబూబాబాద్ మార్కెట్‌కు భారీగా తరలివచ్చిన మిర్చి

సాక్షి, మహబూబాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చిని మార్కెట్‌లో అమ్ముకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో ఒకవైపు సకాలంలో విన్నర్ లిస్టు పెట్టకపోవడం.. మరోవైపు ఉరుములు, మెరుపులతో అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నాయి. కాగా మంగళవారం మార్కెట్ నిండా మిర్చిబస్తాలు ఉండడంతో.. బయటి నుంచి వచ్చే వాహనాలను అనుమతివ్వలేదు. దీంతో ఆందోళన చెందిన రైతులు అధికారులను నిలదీసినా పెద్దగా ఫలితం లేకుండాపోయింది. కాగా, నాలుగైదు రోజులుగా మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్న కొందరు రైతులు బయటకు వెళ్లి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు సరుకులు అమ్ముకొని ఇళ్లకు వెళ్లారు.



మార్కెట్ సెక్రటరీతో వాగ్వాదం చేస్తున్న రైతులు

భారీగా వచ్చిన మిర్చి..

మానుకోట వ్యవసాయ మార్కెట్ వరుసగా రెండు రోజులు బంద్ ఉండడంతో ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు భారీగా మిర్చి వచ్చింది. దీంతో మంగళవారం 15వేల మేరకు బస్తాలతో మార్కెట్ నిండింది. కాగా మధ్యాహ్నం వరకు ప్రకటించాల్సిన విన్నర్ లిస్టును సాయంత్రం 5గంటల వరకు కూడా ప్రకటించలేదు. మరోవైపు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వర్షం పడుతుందని ఆందోళన చెందినరైతులు మార్కెట్ అధికారి కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులను నిలదీశారు. వెయ్యికిపైగా మార్కెట్‌లో టార్పాలిన్లు ఉన్నా వాటిని ఎందుకు తీయడం లేదని, విన్నల్ లీస్టు ప్రకటించడంలో ఎదుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

అధికారులు, వ్యాపారుల కుమ్మక్కు..

మార్కెట్‌కు అధికంగా మిర్చి రావడంతో అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై మోసం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో 56 మంది లైసెన్స్ వ్యాపారులు ఉన్నారు. ఇందులో సగం మంది మిర్చి వ్యాపారులు ఉన్నా.. వారు సిండికేట్‌గా మారి రోజుకు కొంతమంది చొప్పున సరుకులు కొనుగోళ్లు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. పలువురు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాల వాహనాలు మార్కెట్ బయటనే ఉన్నాయి. వాటికి లోపలికి అనుమతి ఇవ్వలేదు. ఈక్రమంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మార్కెట్‌కు సెలవులు అని గేటుకు బోర్డు పెట్టారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు, సోమవారం రంజాన్ పండుగ వస్తోంది. అంటే ఏప్రిల్ ఒకటో తేదీన తిరిగి మార్కెట్ తెరుస్తారు. కావాలనే ఇన్నిరోజులు సెలవులు ప్రకటించారని, దీంతో తప్పని పరిస్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు మార్కెట్ ధర కంటే క్వింటాకు రూ.2వేల మేరకు తక్కువకు సరుకులు అమ్ముకున్నామని రైతులు వాపోయారు. వ్యాపారులు సకాలంలో సరుకులు కొనుగోలు చేయడం లేదని, వారికి అధికారులు కొమ్ము కాస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల పక్షాన ఉండి సమస్యను పరిష్కరించాల్సిన మార్కెట్ పాలక మండలి మౌనంగా ఉండడం.. అందులో కూడా కొందరు వ్యాపారులు ఉండడంతో మార్కెట్ నిర్వహణ సరిగా లేదని రైతులు అంటున్నారు.

నాలుగు రోజుల నుంచి పడిగాపులు



నాలుగురోజుల క్రితం మార్కెట్‌కు మిర్చి తెచ్చాను. వ్యాపారులు వస్తున్నారు.. చూస్తున్నారే తప్ప కొనడం లేదు. ఇప్పుడు మళ్లీ పండుగల్లేవరకు సెలవు అంటున్నారు. మిర్చిఘాటుకు ఎన్నిరోజులు ఉండాలి. తొందరగా కొనుగోలు చేస్తే ఇంటికి పోతాం.

- భూక్య భద్యా, తెల్లబండతండా, చిలుకోడు

చిట్టీ ఇస్తారని ఎదురుచూస్తున్నా..



నాలుగురోజుల నుంచి మిర్చి కొనే చిట్టీలు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నా. ఇక్కడ అధికారులు, సేట్లు గుసగుసలాడుకునుడే సరిపోతుంది.. మార్కెట్‌కు సెలవులు అంటున్నారు. పెద్ద సార్లు, ఎమ్మెల్యే, ఎంపీ పట్టించుకుంటే కానీ మార్కెట్ మారదు.. రైతులు బాగుపడరు. ఇంత అన్యాయం ఎక్కడ లేదు..

- బాదావత్ శాంతి, లక్మాతండా, మహబూబాబాద్

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు..



మూడు రోజుల క్రితం డెబ్బై బస్తాల మిర్చి తెచ్చిన. ఇదిగో వ్యాపారులు వస్తారు.. కొంటారు.. అదిగో వ్యాపారులు కొంటారు అని చెబుతున్నారు. కానీ కొనడం లేదు. నా పక్కన ఉన్నవాళ్లు విసిగిపోయి ప్రైవేట్‌కు అమ్ముకున్నారు. సరుకు కొనకుండా జాప్యం చేస్తే ప్రైవేట్‌కు అమ్ముకోవాలని చూస్తున్నారు. వాళ్లు తక్కువ రేటుకు కొంటున్నారు. కలెక్టర్ సర్ స్పందించి మార్కెట్‌లో రైతులను మోసం చేసే వారిపై చర్య తీసుకోవాలి.

- అజ్మీరా లాల్‌సింగ్, హర్యాతండా, రాజోలు

అధిక మొత్తంలో మిర్చి వచ్చింది

రెండు రోజులుగా మార్కెట్‌కు అధిక మొత్తంలో మిర్చి వచ్చింది. స్థలం సరిపడాలేక, హమాలీలు ఎక్కువ లేకపోవడం, వ్యాపారులు కూడా తక్కువ మందే వస్తున్నారు. అందుకోసమే మార్కెట్‌కు వచ్చిన సరుకుల కాంటాలు అయిన తర్వాతనే కొత్త సరుకు తీసుకురావాలని బోర్డు పెట్టాం. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు రాకుండా చూసుకుంటాం.

- షంషీర్, మార్కెట్ సెక్రటరీ

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



వెలికట్టలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు రూరల్: ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. మంగళవారం తొర్రూరు మున్సిపాలిటీ, మండలంలోని వెలికట్ట గ్రామ పంచాయతీ కార్యాలయం, సోషల్ వెల్ఫేర్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, స్థలాల సమస్యలు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పరిష్కారమవుతాయన్నారు. అన్నివర్గాల ప్రజలు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి యాజమాన్య హక్కు పత్రాలు పొందాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ పూర్ణచందర్, ఆర్‌ఐ బషీర్, వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

నెహ్రూసెంటర్: వేసవికాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టామని మహబూబాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జనగాం నరేశ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట 5ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. సర్కిల్‌లో 130 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, 39 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని తెలిపారు. వేసవికాలం ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అందుకు అనుగుణంగా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నేడు కమిషనర్లతో ఫోన్ ఇన్



దోర్నకల్ కమిషనర్ ఉదయ్ కుమార్



కేసముద్రం కమిషనర్ ప్రసన్నరాణి



దోర్నకల్/కేసముద్రం: సాక్షి ఆధ్వర్యంలో నేడు (బుధవారం)దోర్నకల్ మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణిలతో వేర్వేరుగా 'ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్లు, కుక్కలు, కోతుల బెడద తదితర సమస్యలపై ఫోన్‌చేసి కమిషనర్లతో మాట్లాడవచ్చు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సమస్యలను ఈ కింద ఇచ్చిన సెల్ ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయాలి.

దోర్నకల్ కమిషనర్:
తేది : 26-03-2025, బుధవారం
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
9390121800, 9705346405

కేసముద్రం కమిషనర్:
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
9550727159, 7386158633
సమయం : ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు

న్యూస్‌రీల్

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా క్రీడా ప్రాధికారత సంస్థ ఆధ్వర్యంలో మే 1నుంచి 31వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి మంగళవారం తెలిపారు. ఉచిత శిక్షణకు 14 సంవత్సరాలోపు బాల బాలికలు అర్హులన్నారు. శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి జిల్లాలోని అనుభవజ్ఞులైన క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈ నెల 31వరకు జిల్లా క్రీడలశాఖ కార్యాయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిబిరాల్లో ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు శిక్షణ ఉంటుందని, జిల్లాలోని క్రీడాకారులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'క్షయ'ను తొలి దశలోనే గుర్తించాలి

గార్ల: క్షయ (టీబీ) వ్యాధిని దశలో గుర్తించి వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే నివారించవచ్చని టీబీ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ నీలిమ అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిగూడెం పల్లె దవాఖానలో నిర్వహించిన టీబీ క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. టీబీ రోగులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. టీబీ రోగులకు వ్యాధి తగ్గేంత వరకు నెలకు రూ.1,000 వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ నగదుతో రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 26 మంది అనుమానిత టీబీ వ్యాధిగ్రస్తులకు తెమడ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ రజిత, సూపర్‌వైజర్ జయరాం, ల్యాబ్ టెక్నీషియన్ సాగర్, హెచ్‌ఎస్ ఇస్మాయిల్ బేగ్, ఏఎన్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌ఎఫ్‌తో నిట్ ఒప్పందం



కాజీపేట అర్బన్: ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్‌ఎఫ్) కర్నాటకతో నిట్ వరంగల్ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ బిద్యాధర్ బిద్యాధర్ సుబుదీ, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేపీ చౌదరి పరస్పర ఒప్పందపత్రాలను అందజేసుకున్నారు. కాగా, స్టార్టప్‌ల అభివృద్ధికి ఎంఓయూ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు.

పేద విద్యార్థులకు వరం





సమీకృత గురుకులం కోసం సేకరించిన స్థలం ఇదే, పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మండలంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటు

- స్థల సేకరణతో పాటు నిధుల కేటాయింపు
- శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు
- ప్రారంభమైతే ఈ ప్రాంత విద్యార్థులకు మేలు

కురవి: పేద విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈమేరకు నిధులు కేటాయించింది. సుమారు 20నుంచి 25 ఎకరాల్లో నిర్మించే ఒక్కో సమీకృత గురుకులానికి రూ.200 కోట్లను వెచ్చిస్తోంది. డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో గత డిసెంబర్ 8న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అత్యాధునిక వసతులతో గురుకులాన్ని నిర్మించి ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ పేద విద్యార్థులందరూ ఒకేచోట కలిసి చదువుకోవడానికి వీలు కల్పించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నిర్మాణానికి అడుగులు పడ్డాయి.

ఈ ప్రాంత విద్యార్థులకు మేలు..

డోర్నకల్ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గురుకులంతో ఎంతో మేలు జరగనుంది. ఇప్పటికే ఉన్న పాఠశాలలకు తోడుగా సమీకృత గురుకుల పాఠశాలతో అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట చేరి చదువుకోవడం ద్వారా అసమానతలు తొలగుతాయి. కాగా మరిపెడ, చిన్నగూడూరు, డోర్నకల్, కురవి, సీరోలు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల పేద విద్యార్థులకు ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. జాతీయ రహదారికి సమీపంలో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో రవాణా సౌకర్యం సులభతరం కానుంది.

అసమానతలు తొలగుతాయి



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల్లోని పేద విద్యార్థులందరూ ఒకే చోట ఉండి చదువుకోవడం ద్వారా అసమానతలు తొలగుతాయి. సమీకృత గురుకులాల ఏర్పాటు అభినందనీయం. ప్రభుత్వం వెంటనే పనులు మొదలు పెట్టాలి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల నిర్వహణ సాగాలి.

- నల్లు సుధాకర్‌రెడ్డి, అయ్యగారిపల్లి

విద్యాభివృద్ధికి దోహదం..



నియోజకవర్గంలోని అన్ని మండలాలకు దగ్గరలో సమీకృత పాఠశాల నిర్మాణం చేయడం ద్వారా విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. ఈ ప్రాంత పేద విద్యార్థులకు వరంగా మారనుంది. పనులు త్వరగా ప్రారంభించాలి. జాతీయ రహదారికి దగ్గరగా ఉండడం విద్యార్థులకు లాభం చేకూరుంది.

- మలిశెట్టి వేణు, కొత్తూరు

తరాలపల్లి నుంచి దండకారణ్యం వరకు...

- 35 ఏళ్ల అజ్ఞాతవాసం... దళసభ్యుడినుంచి డీకేఎస్‌జడ్‌సీ వరకు
- దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన సుధీర్
- విషాదంలో తరాలపల్లి.. నేడు గ్రామానికి మృతదేహం

ముగిసిన అంకేశ్వరపు సారయ్య ఉద్యమ ప్రస్థానం





ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన సారయ్య, తరాలపల్లిలోని ఆయన ఇల్లు

సాక్షిప్రతినిధి, వరంగల్/కాజీపేట అర్బన్ : అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్, ఎల్లన్న, సుధాకర్.. హనుమకొండ జిల్లా తరాలపల్లి ముద్దుబిడ్డ.. రెండు పదుల వయస్సులో ఆయిడిసి, బాయిడిసి అడవిబాట పట్టిన మావోయిస్టు నేత. దళసభ్యుడి నుంచి దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడి వరకు ఎదిగిన సారయ్య అలియాస్ సుధీర్ 35 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. దంతెవాడ జిల్లా బీజాపూర్ ప్రాంతంలోని గీడం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్సాపర, నెల్గోడ, బోడ్గా, ఇకెలి గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఎస్పీ గౌరవ్‌రాయ్ మంగళవారం ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ముగ్గురు మృతిచెందగా.. మృతుల్లో సారయ్య ఉన్నట్లు వెల్లడించారు. బీజాపూర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య మృతి చెందాడన్న వార్తతో తరాలపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా బుధవారం సారయ్య మృతదేహం గ్రామానికి చేరనుంది.

విద్యార్థిదశ నుంచే ఉద్యమాలు..

తరాలపల్లి గ్రామానికి చెందిన సారయ్య కొండపర్తి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. 1982లో 10వ తరగతి చదువుతున్న తరుణంలోనే నాడు మావోయిస్టులు ఇచ్చిన 'గ్రామాలకు తరలండి' పిలుపుకు ఆకర్షితుడై, తరాలపల్లి విలేజ్ ఆర్గనైజర్ బండి ఆశాలు, హనుమకొండ సిటీ ఆర్గనైజర్ తిప్పారపు రాములు అలియాస్ తాత సారథ్యంలో తరాలపల్లి గ్రామ అధ్యక్షుడిగా ప్రస్థానం ప్రారంభించాడు. అంచెలంచెలుగా మావోయిస్టు పార్టీలో ఎదుగుతున్న తరుణంలో 1990లో బీఎస్‌ఎఫ్ సిబ్బంది గ్రామాల్లో రావడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 1993లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిటీ ఆర్గనైజర్ తాత చనిపోవడంతో.. అజ్ఞాతంలోకి వెళ్లిన సారయ్య గ్రామానికి తిరిగి రాలేదు.

ముగిసిన 35 ఏళ్ల ప్రస్థానం..

సుమారు 35 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో తన ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించిన సారయ్య మంగళవారం ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. హనుమకొండ, ఖమ్మం జిల్లాల్లో వివిధ స్థాయిల్లో పనిచేసి 1995లో దండకారణ్యానికి వెళ్లిన ఆయన దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. ప్రస్తుతం ఈస్ట్ బస్తర్ డీకేఎస్‌జడ్‌సీ సభ్యుడిగా, మాస్ మొబైల్ అకడమిక్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది.

అమరుల పల్లె తరాలపల్లి ..

కాజీపేట మండలం తరాలపల్లి ఉద్యమాలకు కేరాఫ్. ఎందరో ఈ గ్రామంనుంచి విప్లవోద్యమాల వైపు ఆకర్షితులై ఎన్‌కౌంటర్లలో అసువులు బాశారు. 1991లో వేల్పుల జగదీశ్ అలియాస్ ఉప్పలన్న, 1992లో బండి ఆశాలు అలియాస్ శ్రీను పగిడేరు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. 1998 నుంచి గాజుల శ్రీకాంత్ అలియాస్‌శ్రీనాథ్, ముప్పిడి నాగేశ్వర్‌రావు అలియాస్ విశ్వనాథ్,చిరబోయిన సదానందం అలియాస్ కౌముదీ,సంపత్, కొత్తపల్లి సాంబయ్య అలియాస్ ఉప్పలన్నలు మృతిచెందగా.. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అంకేశ్వరపు సారయ్య చనిపోవడం చర్చనీయాంశంగా మారింది.

430 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

- మిల్లు యజమానిపై కేసు



రేషన్ బియ్యం లారీతో సివిల్ సప్లయీస్ అధికారులు

నెల్లికుదురు: లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 430 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటన మండలంలోని ఆలేరులో మంగళవారం జరిగింది. జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం.. ఆలేరులోని శ్రీ రాజరాజేశ్వర రైస్ మిల్లులో వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన చేసిన రేషన్‌బియ్యం నిల్వ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు మిల్లులో తనిఖీ చేసి లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 430 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రైస్ మిల్లు యజమాని గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, రేషన్ బియ్యానికి క్లీనింగ్ పాలిష్ చేసి వరంగల్‌లోని సాయి లక్ష్మి రైస్ మిల్లుకు తరలించి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిందన్నారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం కూడా శ్రీ రాజరాజేశ్వర రైస్ మిల్లులో నిల్వ ఉంచిన 105క్వింటాళ్లబియాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

అంతర్జాతీయ సదస్సులో రాణింపు



అమెరికాలో అవార్డు అందుకుంటున్న శ్రీతేజ్

చిన్నగూడూరు: అమెరికాలో జరిగిన మిసిసిప్పి 89వ వార్షిక అంతర్జాతీయ సదస్సులో మండల కేంద్రానికి మాటేటి శ్రీతేజ్ పాల్గొని సత్తాచాటాడు. ఉత్తమ ఓరల్ ప్రజంటేషన్ విభాగంలో అవార్డుతో పాటు నగదు బహుమతిని సాధించాడు. సోలనేషియస్ క్రాప్స్ ఇన్ఫెక్టింగ్ ఫైటో ప్లాస్మాస్, సీడ్ ట్రాన్స్‌మిషన్ ఎపిడెమియోలాజికల్ ఇన్‌సైట్స్ అనే అంశంపై ప్రసంగించి అవార్డు గెలుచుకున్నాడు. విశ్వవేదికపై మెరవడంతో పాటు అవార్డును సొంత చేసుకోవడంతో వివిధ రంగాల ప్రముఖులు, పలు వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా శ్రీతేజ్ కుటుంబం కొన్నేళ్లక్రితమే ఉపాధి కోసం కాగజ్‌నగర్‌కు తరలివెళ్లి స్థిరపడింది.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.41.35లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి హుండీ ఆదాయం రూ.41,35,045 వచ్చినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో 17 హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత సమక్షంలో లెక్కించారు. గత ఏడాది డిసెంబర్ 26నుంచి ఈనెల 24వ తేదీ వరకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు రూ.41,35,045వచ్చినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, శక్రునాయక్, కె.ఉప్పలయ్య, చిన్నం గణేశ్, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి, ఆలయ సిబ్బంది, మానుకోటకు చెందిన లక్ష్మీ శ్రీనివాస సేవాట్రస్ట్, మణుగూరుకు చెందిన ఉమాశంకర్‌రావు శ్రీ వారి ట్రస్ట్ భక్తమండలి సభ్యులు 280 మంది లెక్కింపులో పాల్గొన్నారు.

భద్రకాళి శేషుకు 'ఆగమ ద్యుమణి' బిరుదు

హన్మకొండ కల్చరల్: వరంగల్‌కు చెందిన ఆగమ సామ్రాట్, భద్రకాళి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, అర్చకుడు భద్రకాళి శేషు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి ఆగమ ద్యుమణి బిరుదు అందుకున్నారు. విశ్వవిద్యాలయం వార్షికోత్సవాన్ని వైస్‌చాన్స్‌లర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన మంగళవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేశంలోని నిష్ణాతులైన పండితులకు పురస్కారాలు అందించి సన్మానించారు. బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త ఎల్‌ఎన్ రాఘవేంద్ర ముఖ్య అతిథిగా హాజరై భద్రకాళి శేషుకు ఆగమ ద్యుమణి బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శేషుకు భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి, సిబ్బంది, వరంగల్ సంగీత విద్వత్ గానసభ, అర్షధర్మరక్షణ సంస్థ సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

రేపు 'నిధి ఆప్కే నికట్'

హన్మకొండ అర్బన్ : ఈపీఎఫ్‌ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు పరిష్కరించడానికి ఈనెల 27న (గురువారం) నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరంగల్ రీజియన్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ తానయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు సంబంధించి వరంగల్‌లోని వైభవ్ లక్ష్మి షాపింగ్ మాల్, హనుమకొండలోని గ్రీన్‌వుడ్ హైస్కూల్, తొర్రూరులోని సెయింట్ పాల్స్ హైస్కూల్, జనగామలోని శాన్ మారియా హైస్కూల్, భూపాలపల్లిలోని ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగులోని శ్రీ అరవింద ఉన్నత పాఠశాల, ఖమ్మంలోని మమత హాస్పిటల్ రోడ్డులో గల ఎస్‌బీఐటీ కళాశాల, ఇల్లందులోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదుల స్వీకరణతో పాటు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధి కూలీగా.. జనగామ కలెక్టర్


రోడ్డు పనులు చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి: జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉపాధి కూలీగా మారారు. రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి శివారులో ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన ఆర్సీబీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. దాదాపు గంటపాటు కూలీలతో గడిపి వారి పనుల్లో చేతి కలిపారు. అలుగుతో తవ్వుతూ కొద్దిసేపు రోడ్డు పనులు చేశారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకొని వేసవి దృష్ట్యా ఉదయం వేళల్లో పనులు చేయాలని వారికి సూచించారు.

దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు

మహబూబాబాద్ రూరల్ : దాడి కేసులో నేరం నిరూపణకాబడిన ఒకరికి మహబూబాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ యు.తిరుపతి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2020 సంవత్సరంలో మహబూబాబాద్ మండలం ఆమనగల్ శివారు పెద్దతండాకు చెందిన గుగులోత్ పర్తియా తన చెలక వద్ద పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో పాత కక్షల నేపథ్యంలో అదే తండాకు చెందిన ఇస్లావత్ శ్రీకాంత్ ఘర్షణ పడి పర్తియాను కొట్టాడు. ఈ ఘటనపై బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సీహెచ్.రమేశ్ బాబు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించి అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి గొడిశాల సురేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన ఏపీపీ జయలత కోర్టులో వాదనలు వినిపించగా నేరం నిరూపణ కాబడిన శ్రీకాంత్‌కు అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ తిరుపతి ఏడాది జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.



'డిగ్రీ' ఉత్తీర్ణత అంతంతే..

సెమిస్టర్ సిస్టంలోనూ మెరుగైన ఫలితాలేవి!
- ఇటీవల ఫలితాలు ప్రకటించిన అధికారులు
- ఇందులో బాలికలదే హవా..
- రీవాల్యుయేషన్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు
- అటానమస్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీలో ఒకప్పుడు వార్షిక ఫలితాల విధానం ఉండేది. సంవత్సరం మొత్తం పాఠాలు చెప్పిన తర్వాత పరీక్షలు నిర్వహించే వారు. అనంతరం ఫలితాలు ప్రకటించేవారు. అయితే ఇందులో విద్యార్థులు తక్కువ ఉత్తీర్ణత సాధించేవారు. దీంతో ఈ విధానాన్ని రద్దు చేసి కొన్ని సంవత్సరాల క్రితం సెమిస్టర్ సిస్టంను తీసుకొచ్చారు. అయినా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నారు. సెమిస్టర్ విధానంలో ఉదాహరణకు ఒక సబ్జెక్టుకు 100 మార్కులు ఉంటే అందులో 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. ఇక ప్రతీ సబ్జెక్టుకు 80 మార్కుల సెమిస్టర్ పరీక్ష ఉంటుంది. అందులో వచ్చిన మార్కులు, ఇంటర్నల్‌లో వచ్చిన మార్కులు కలిపే ఉత్తీర్ణత ప్రకటిస్తారు. అయినా ఈ విధానం వల్ల వివిధ సబ్జెక్టుల్లో పాస్ మార్కులు కూడా రాక వేలాది మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. ప్రతీ సెమిస్టర్ పరీక్షల్లోనూ అప్పటి వరకు పూర్తయిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయి. కొద్దిపాటిగా చదువుకున్నా ఉత్తీర్ణత సాధించే పరిస్థితి ఉంటుంది. ఎక్కువ మార్కులు రావాలంటే కొంచెం కష్టపడాల్సిందే. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకులాలు డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 'బి' ఒకేషనల్, 'బి' ఎస్సీ హానర్స్ కోర్సుల్లో నిర్వహించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలతోపాటు రెండో సంవత్సరం మూడో సెమిస్టర్, ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కొద్దిరోజుల క్రితం అధికారులు ప్రకటించారు.ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం అంతంతమాత్రంగానే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

సెమిస్టర్ సిస్టంలోనూ మెరుగైన ఫలితాలేవి?

డిగ్రీ కోర్సుల సెమిస్టర్ సిస్టంలో విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరై కొంచెం కష్టపడినా ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంది. అయితే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించలేకపోవడానికి పలు కారణాలున్నాయని భావిస్తున్నారు. ఇందులో ప్రధానంగా తరగతులకు సరిగా హాజరుకాకపోవడం. వాస్తవంగా 75శాతం హాజరు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ ఏ కళాశాలలోనూ అమలు చేయడం లేదు. ప్రభుత్వ కళాశాలలే కాదు ప్రైవేట్ కళాశాలల్లోనూ నాణ్యమైన విద్యనందించడం లేదనే అంశం ఈఫలితాలను బట్టి తెలుస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువమంది పేద వర్గాలకు చెందిన వారే ఉంటారు. కొందరు కళాశాలకు అప్పుడప్పుడు వస్తూ కుటుంబ పరిస్థితులు బట్టి ప్రైవేట్‌లో ఉపాధి పొందుతున్న పరిస్థితి కూడాఉందని తెలుస్తోంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు యాజమాన్యాలు సరిపడా బోధనా సిబ్బందిని నియమించుకోవడం లేదు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు సైన్స్ విద్యార్థులకు సరిగా ప్రాక్టికల్స్ కూడా నిర్వహించడం లేదు. మరోవైపు విద్యార్థులు ఎక్కువ సమయం సెల్‌లో మునిగిపోవడం కూడా ఉత్తీర్ణతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

అటానమస్ డిగ్రీ కాలేజీల్లో ఉత్తీర్ణత ఇలా..

అటానమస్ కాలేజీల్లో మాత్రం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. హనుమకొండ కేడీసీ (అటానమస్) డిగ్రీ మొ దటి సెమిస్టర్ పరీక్షల్లో 56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల మొదటి సెమిస్టర్ లో 61.93 శాతం, మూడో సెమిస్టర్‌లో 73.27 శాతం, ఐదో సెమిస్టర్‌లో 82.52శాతం ఉత్తీర్ణత సాధించారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్‌లో 38.64 శాతం, 3వ సెమిస్టర్ లో 53.33శాతం ఉత్తీర్ణత సాధించారు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మొదటి సెమిస్టర్‌లో 43.59శాతం, మూడో సె మిస్టర్‌లో 58.69శాతం, 5వ సెమిస్టర్‌లో 65.04శాతం ఉత్తీర్ణత సాధించారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 21.93 శాతమే ఉత్తీర్ణత

కేయూ పరిధిలో ఆయా డిగ్రీ కోర్సుల్లో మొత్తం 70,661 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే అందులో 15,495మంది (21.93శాతమే) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 36,504మంది పరీలకు హాజరైతే అందులో 5,278మంది (14.46శాతం)ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 34,157మందికిగాను 10,217 మంది 29.91శాతం ఉత్తీర్ణత పొందారు. ఇందులో బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది.

డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 40.73 శాతం ..

ఆయా డిగ్రీకోర్సుల్లో మొత్తం 46,828మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 19,074 మంది ఉత్తీర్ణత (40.73శాతం) సాధించారు.బాలురు 23,402 మందికిగాను 6,808మంది(29.09శాతం) ఉత్తీర్ణత, బాలికలు 23,426 మందికిగాను 12,266మంది(52.36శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురకంటే బాలి కల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంది.

డిగ్రీ మూడో సెమిస్టర్‌లో 28.97శాతం ఉత్తీర్ణత

డిగ్రీ ఆయా కోర్సుల్లో మూడో సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 59,916మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 17,356మంది ఉత్తీర్ణత (2 8.97శాతం)సాధించారు. బాలురు 29,771మందికి గాను 5,924 మంది (19.90శాతం), బాలికలు 3 0,145 మందికి గాను 11,432మంది (37.92శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలుర కంటే బాలికలే ఎక్కవశాతం ఉత్తీర్ణత పొందారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల వెల్లువ..

కేయూ పరిధిలో డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ఇటీవల విడుదల చేశారు. కొద్దిరోజులుగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు స్వీకరించారు. రీవాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25వ తేదీతో ముగిసింది. 1,3,5 సెమిస్టర్లు కలిపి 21,928 దరఖాస్తులు వచ్చాయి.ఒక్కో దరఖాస్తుకు రూ. 305 ఫీజు ఉంటుంది. రీవాల్యుయేషన్‌లో ఏమైనా ఫలితం లభిస్తుందనే ఉద్దేశంతో కొన్నేళ్లుగా వివిధ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చినవారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. అడ్డ దారిలో ఏమైనా అవకాశం ఉంటుందా అని కూడా కొందరు విద్యార్థులు పరీక్షల విభాగం చుట్టు తిరుగుతుంటారు. గతంలో రీవాల్యుయేషన్ దందా వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. ఈసారి 21,928మంది దరఖాస్తుల్లో ఎంత శాతం మంది బెనిఫిట్ (ఫలితం) పొందుతారో వేచిచూడాలి.

బకాయిలు చెల్లించండి..!

లేకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని హౌసింగ్ బోర్డు నోటీసులు


హనుమకొండ వడ్డేపల్లిలోని హౌసింగ్ బోర్డు కాలనీ

కాలనీవారీగా బకాయిలు (రూ.లలో)

వరంగల్ గొర్రెకుంట కాలనీ	9,43,58,063
హనుమకొండ వడ్డేపల్లి	3,67,81,668
జనగామ	2,18,90,827
మరిపెడ	7,19,45,743

- ఈ నెల 31లోపు చెల్లించాలని అల్టిమేటం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.22,49,76,301 బకాయిలు
- వడ్డీకి వడ్డీ వేశారంటున్న లబ్ధిదారులు

హన్మకొండ: పెండింగ్ బకాయిలను రాబట్టుకునేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కఠిన చర్యలకు పూనుకుంది. ఈ నెల 31లోపు బకాయిలు చెల్లించకపోతే ఇళ్లు ఖాళీ చేయాల్సి ఉంటుందని అల్టిమేటం ఇచ్చింది. ఈ మేరకు హౌసింగ్ బోర్డు నోటీసులు జారీ చేసింది. హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ పరిధిలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ హౌసింగ్ బోర్డు పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. వాయిదాల మేరకు సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉండగా కొంతమంది నిర్లక్ష్యం చేశారు. బకాయిలు తడిసి మోపెడు కావడంతో హౌసింగ్ బోర్డు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంతో లబ్ధిదారులు మొత్తుకుంటున్నారు. అసలుకు వడ్డీలపై వడ్డీలు వేసి అధిక మొత్తం చెల్లించాలని నోటీసులు జారీ చేశారని లబోదిబోమంటున్నారు.

వరంగల్ డివిజన్ పరిధిలో 528 మందికి నోటీసులు..

తెలంగాణ హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ పరిధిలోని హనుమకొండ వడ్డేపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, వరంగల్ గొర్రెకుంట కాలనీ, జగిత్యాల, మంచిర్యాల నస్‌పూర్ కాలనీ, మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ కాలనీ, కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, జమ్మికుంటలోని హౌసింగ్ బోర్డు కాలనీ, జనగామలోని హౌసింగ్ బోర్డు కాలనీ, కొత్తగూడెం చుంచుకాలనీకు చెందిన బకాయిలు మొత్తం రూ.44,69,99,904 పేరుకుపోయాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 528 మందికి నోటీసులు జారీ చేశారు.

ఒక్కో కాలనీలో రూ.3లక్షల నుంచి రూ.18 లక్షలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.22,49,76,301 బకాయిలు పేరుకుపోయినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించేందుకు గడువు విధించారు. గడువులోగా బకాయిలు చెల్లించకపోతే ఇళ్లు ఖాళీ చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఒక్కో కాలనీలో బకాయిదారులు రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు బకాయిలున్నారు. బకాయిలు సంస్థకు గుదిబండగా తయారయ్యాయి. ఈ క్రమంలో రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి బకాయిలు వసూలు చేయాల్సిందేనని సీరియస్‌గా చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు హుటాహుటినా నోటీసులు జారీ చేశారు.

నోటీసులు జారీ చేశాం..

పేరుకుపోయిన బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు బకాయిదారులకు నోటీసులు జారీ చేశాం. ఈ నెల 31వ తేదీలోపు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరాం. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- అంకం రావు, హౌసింగ్ బోర్డు వరంగల్ డివిజన్ ఈఈ

జిల్లాల వారీగా ఇలా..

- హనుమకొండ వడ్డేపల్లిలో అపార్ట్‌మెంట్ మోడల్‌లో 744 ఫ్లాట్లు నిర్మించారు. వీటిని 1990లో లబ్ధిదారులకు కేటాయించగా చాలా మంది క్రయవిక్రయాలు జరిపారు. ఇక్కడ రూ.3,67,81,668 బకాయిలు పేరుకుపోగా ఇప్పుడు 142 మందికి నోటీసులు జారీ చేశారు.
- వరంగల్ గొర్రెకుంట కాలనీలో 1376 ఇళ్లు నిర్మించారు. వీటిని దశల వారీగా 1992, 1993, 2003, 2012లో లబ్ధిదారులకు కేటాయించారు. ఈ కాలనీలో రూ.9,43,58,063 బకాయిలు పేరుకుపోగా వీటిని రాబట్టుకునేందుకు 103 మందికి నోటీసులు జారీ చేశారు.
- మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 79 ఇళ్లు నిర్మించి 1997లో లబ్ధిదారులకు కేటాయించారు. ఇక్కడ రూ.7,19,45,743 బకాయిలు ఉండగా, వీటిని రాబట్టుకునేందుకు 64 మందికి నోటీసులు జారీ చేశారు.
- జనగామ హౌసింగ్ బోర్డు కాలనీలో 127 ఇళ్లు నిర్మించగా రూ.2,18,90,827 బకాయిలు పేరుకుపోయాయి. వీటిని రాబట్టుకునేందుకు 17 మందికి నోటీసులు జారీ చేశారు.

బంగారం తాకట్టులో మోసం

- నకిలీ గోల్డ్‌తో రుణం తీసుకున్న యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన ప్రైవేట్ బ్యాంకు నిర్వాహకులు

మహబూబాబాద్ రూరల్ : బంగారు ఆభరణాల తాకట్టులో ఓ యువకుడు మోసానికి పాల్పడ్డాడు. ఓ ప్రైవేట్ బ్యాంకులో నకిలీ బంగారు ఆభరణాలు పెట్టి రుణం తీసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో ఓ ప్రైవేట్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం కురవి మండలానికి చెందిన ఓ యువకుడు 28 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొచ్చి ఆ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.1.55 లక్షల అప్పు తీసుకున్నాడు. అనంతరం నాలుగు రోజుల తర్వాత సదరు బ్యాంకు ఉన్నతాధికారుల బృందం తనిఖీకి వచ్చింది. ఖాతాదారులు బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు పరిశీలించారు. ఇందులో ఓ ఆభరణాన్ని పలుమార్లు పరిశీలించి చూడగా నకిలీ అని తేలింది. వెంటనే ఆ ఆభరణాన్ని తాకట్టు పెట్టిన యువకుడికి ఫోన్ చేసి విషయం చెప్పారు. అది నకిలీ బంగారు ఆభరణమని తనకు తెలియదని, తన మిత్రుడు ఆ ఆభరణాన్ని తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని రమ్మంటే వచ్చానని తెలిపాడు. ఇందుకు ఒప్పుకోని బ్యాంకు అధికారులు ఎవరైతే ఆభరణాలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని వెళ్తారో వారే అందుకు బాధ్యత వహించాల్సి వస్తుందని తేల్చి చెప్పారు. దీంతో యువకుడు స్పందించకపోవడంతో బ్యాంకు అధికారులు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు.. ఆ యువకుడిని పీఎస్‌కు పిలిపించి మాట్లాడుతున్నట్లు సమాచారం.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- జీఎం కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి (ఎఫ్‌పీఓ) రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ,కలెక్టర్

ఖిలా వరంగల్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని రాష్ట్ర శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య సూచించారు. వరంగల్ నక్కలపల్లి రహదారిలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే రైతు ఉత్పత్తుల మేళాను మంగళవారం రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధతో కలిసి ఎమ్మెల్సీ సారయ్య.. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతులు మోసపోవద్దని, రైతును బలోపేతం, చైతన్య పర్చడానికే ఎఫ్‌పీఓ మేళా ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ రైతులు ఆర్థిక బలోపేతం, లాభసాటి సాగుకు ఎఫ్‌పీఓల పాత్ర కీలకమన్నారు. 40 ఉత్పత్తి దారుల సంఘాలు స్టాళ్లు ఏర్పాటు చేయగా .. ఆ ఉత్పత్తుల అమ్మకాలు చేపడుతున్నామన్నారు.

ఎఫ్‌పీఓ మేళాకు స్పందన..

ఎఫ్‌పీఓ మేళాకు స్పందన లభించింది. రాష్ట్రం నలుమూలాల నుంచి భారీగా రైతులు, నగర ప్రజలు చేరుకున్నారు. స్టాళ్లను ఆసక్తిగా తిలకించి అవసరమైన పనిముట్లు, గృహోపకరణాలు, విత్తనాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏసీ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రామన్‌సింగ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పీజేటీఏయూ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ సుజాత, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, తహసీల్దార్లు బండి నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, ఏడీఏ యాకయ్య, ఏఓ రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్ ఈదుల అరుణ్, రైతులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు..

- లారీ కింద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి
- రామకిష్టాపూర్(టి)లో ఘటన
- సాయంత్రం పనికి వెళ్లకుంటే బతికేవారేమో..


పూలమ్మ (ఫైల్)


సంధ్య (ఫైల్)

టేకుమట్ల: రెక్కాడితే గాని డొక్కాడని రెండు నిరుపేద కుటుంబాలను మృత్యువు వెంటాడింది. ఉదయం కూలీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఖాళీగా ఉంటే ఏముంటుంది..? అదనపు కూలీకి వెళ్తే పూట అయినా గడుస్తుంది కదా అనే ఆశతో సాయంత్రం కూడా వెళ్లారు. అయితే ఈ కూలే వారికి చివరిది అవుతుందని అనుకోలేదు. పాపం.. పని వెళ్లకున్నా బతికేవారేమో. మృత్యువు లారీ రూపంలో ఇద్దరు మహిళా కూలీలను కబలించింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(టి)లో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షుల కథనం ప్రకారం.. రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మోకిడి పూలమ్మ(45), మోకిడి సంధ్య(30)తోపాటు మరో ఆరుగురు కూలీలు ఉదయం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. సాయంత్రం వేళలో కూడా మళ్లీ అదే గ్రామానికి చెందిన సల్పాల బుచ్చయ్య అనే రైతు పొలంలోని పని చేయడానికి వెళ్తున్నారు. సరిగా పొలం వద్దకు చేరుకునే సమయానికి చిట్యాల మండలం శాంతినగర్ శివారు కాటన్ మిల్లు నుంచి అతివేగంగా పత్తి గింజల లోడ్‌తో మూలమలుపు వద్ద నుంచి వస్తున్న లారీని గమనించిన కూలీలు కొంత దూరం పరుగులు తీశారు. ఇందులో ముగ్గురు పొలంలోకి వెళ్లడంతో అక్కడే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పత్తి గింజల బస్తాలు పడడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తృటిలో తప్పించుకుంది. తోటి మహిళా కూలీలు భయంతో కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్సై అమరేందర్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని జేసీబీ సాయంతో లారీని లేపారు. మృతదేహాలను పత్తి గింజల బస్తాల కింద నుంచి బయటకు తీసి 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అప్పటి వరకు అందరి మధ్యలో ఉన్న ఇద్దరు విగత జీవులుగా మారడంతో తోటి మహిళా కూలీల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారైనట్లు మహిళా కూలీలు తెలిపారు.

పిల్లలు ఎవరిని అమ్మా అని పిలవాలి సంధ్యా..

మన పిల్లలు ఇక నుంచి ఎవరిని అమ్మా అని పిలవాలి సంధ్యా.. ఒక్కసారి చూడు సంధ్యా.. నా ప్రాణం పోయేలా ఉంది.. అయ్యో దేవుడా ఒక్కసారి బతికించమంటూ సంధ్య భర్త రాజు రోదించిన తీరు చిట్యాల సివిల్ ఆస్పత్రిలో ప్రతీ ఒక్కరిని కంట తడి పెట్టించింది. అమ్మా లే.. అమ్మా లే.. అంటూ చిన్నారుల రోదనలు మిన్నంటాయి. పూలమ్మ భర్త, కూతురు సైతం కన్నీరుమున్నీరయ్యారు. సంధ్య, పూలమ్మ కుటుంబ సభ్యులు పెద్దఎత్తున చిట్యాల సివిల్ ఆస్పత్రికి చేరుకుని వారి మృతదేహాల మీద పడి గుండెలవిసేలా రోదించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ : వృద్ధుడి మృతి

మొగుళ్లపల్లి: లారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం చింతకుంటరామయ్యపల్లికి చెందిన మోత్కురి రాములు(60) తన మనుమడు మణిదీప్‌తో కలిసి బైక్ (ఎక్సెల్)పై మండలంలోని ముల్కలపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రం శివారులోని పెద్ద వాగు బ్రిడ్జి దగ్గర జమ్మికుంట నుంచి మొగుళ్లపల్లికి వస్తున్న లారీ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందగా మణిదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మణిదీప్‌ని 108లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

కారును ఢీకొన్న టిప్పర్..

- వ్యక్తి దుర్మరణం
- కొత్తపల్లి శివారులో ఘటన


కరుణాకర్ మృతదేహం

ఎల్కతుర్తి: టిప్పర్.. కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్‌టీపీసీ జ్యోతి నగర్‌కు చెందిన కనుకపుడి కరుణాకర్(58) చర్చ్ ఫాదర్. సోమవారం రాత్రి ఒంటి గంటకు కారులో ఎల్కతుర్తి మీదుగా హుస్నాబాద్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని చాయ్ విహార్ సమీపంలో ముల్కనూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఎదురుగా కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.